## క్లుప్తంగా

### ఘనంగా గంగమ్మ దేవత కంకణధారణ

లింగాల : మహాశివరాత్రి రోజు రాత్రి 12 గంటల ప్రాంతంలో పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల్లో వెలసిన గంగమ్మ దేవతలకు కంకణ ధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ల ఇళ్లల్లో భద్రపరిచిన అమ్మవారి అభరణాలను, పట్టు వస్త్రాలను మేళ, తాళాలతో గంగమ్మ ఆలయాలకు తరలించి కంకణ ధారణ గావించారు. వచ్చేనెల 9వ తేదీన తిరుణాలకు శ్రీకారం చుట్టారు. తిరుణాల వరకు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తిరుణాలకు అమ్మవారిని నిద్ర లేపేందుకు ప్రతిరోజు ఉదయం, రాత్రి డప్పులు, మేళాలతో అమ్మవారిని తిరుణాలకు నిద్ర లేపుతారని ఆలయ కమిటీ చైర్మన్లు తెలిపారు.

### నేడు గంగమ్మ తిరునాల

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామంలో శ్రీగంగమ్మ–పాలేటమ్మ తిరునాల కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామంలోని గంగమ్మ దేవాలయం వద్ద గురువారం నుంచి తిరునాల జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### గడ్డివాము దగ్ధం

పెండ్లిమర్రి : మండలంలోని ఎగువపల్లె సమీపంలోని కలాల్లో దిగువపల్లెకు చెందిన దాసరి నడిపి గంగన్నకు చెందిన గడ్డి వాముకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. కమలాపురం నుంచి అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. దాదాపు రూ.10వేలు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.


### అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘన నివాళి



ఆర్డీఓ చిన్నయ్య, దళిత ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కోల ప్రసాద్‌లను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని నగరిగుట్ట క్రిస్టియన్ లైన్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు దళిత ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కోల ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో చిన్నయ్య హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చిన్నయ్య మాట్లాడుతూ కోలా ప్రసాద్ క్రిస్టియన్ లైన్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఏడాదైందన్నారు. అనంతరం ఆర్డీఓ చిన్నయ్య, కోలా ప్రసాద్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. నెల్లూరు వారు ప్రత్యేక పాటలతో అలరింపజేశారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో బుధవారం శివరాత్రి పండుగ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేంపల్లె సంసిద్ సతీష్ రెడ్డి స్కూల్ చిన్నారులచే శివరాత్రి, సినిమా పాటలకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీల దేవి, నృత్య శిక్షకుడు శబరిష్, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్ జగన్‌ను కలిసిన ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఆర్‌సీడీఎస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్) అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట సర్వోత్తమ్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సునీతరెడ్డి, తదితరులు కలిసి మాట్లాడారు. సమస్యల గురించి వివరంగా తెలపడంతోపాటు రెడ్లపై పెడుతున్న తప్పుడు కేసుల గురించి, రెడ్లు వైఎస్ఆర్ సీపీకి చేస్తున్న సేవలు గురించి, పేద రెడ్ల స్థితిగతుల గురించి తెలియజేశారు. త్వరలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# హర హర మహాదేవ..

- శివనామ స్మరణలతో మారుమ్రోగిన శైవక్షేత్రాలు
- భక్తులతో పోటెత్తిన శివాలయాలు

పులివెందుల టౌన్ : మహా శివరాత్రి పండుగ సందర్భంగా బుధవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పులివెందుల పట్టణంలోని శ్రీమిట్ట మల్లేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అర్చకులు రుద్రమూర్తి అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. శివపార్వతుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ఉమామహేశ్వరాలయం (బసవన్నకట్ట)లో, వీరభద్రస్వామి ఆలయంలో, పార్నపల్లె రోడ్డు కోతి సమాధి వద్ద ఉన్న శివాలయంలో పూజలతోపాటు అన్నదానం నిర్వహించారు. శ్రీమిట్టమల్లేశ్వరస్వామిని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డిలు పూజలు చేశారు. కనంపల్లె సమీపంలో ఉన్న



చింతకొమ్మదిన్నె : బుగ్గమల్లేశ్వరస్వామి, పార్వతీదేవి కల్యాణోత్సవం



వీఎన్‌పల్లెలో రాతి దూలాన్ని లాగుతున్న ఎద్దులు



వీఎన్‌పల్లె : భక్తులకు దర్శనమిచ్చిన సంగమేశ్వరుడు



లింగాల : అంబకపల్లె సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ముద్దనూరులో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పొలతలలో ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరస్వామి

నామాలగుండు సిద్ధలింగేశ్వరాలయంలో పూజలు, అభిషేకాలు, అన్నదానం చేశారు. మోట్నూతలపల్లె గ్రామ సమీపంలోని గవి కోనమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పంచలింగాల కోన, గుండాలయ కోన, నల్లపురెడ్డిపల్లెలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయాలలో శివరాత్రి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన ప్రసాదాలను పంపిణీ చేశారు.

**పెండ్లిమర్రిలో..**

పెండ్లిమర్రి : పోలతల క్షేత్రంలో జిల్లా నలుమూల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చి మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకున్నారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగు కుండా ఆలయ ఈఓ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. క్షేత్రంలో అక్క దేవతల గుడి చూట్టు అడుగడుగునా భక్తుల సందడి కనిపించింది. మహిళా భక్తులు పూనకంతో ఊగిపోయారు. సంతానం కొసం అక్కదేవత గుడి ఎదుట వరపడ్డారు. ఉదయం10.30 గంటల నుంచి 12.00 గంటల వరకు శ్రీమల్లేశ్వర స్వామి, పార్వతిదేవి అమ్మవార్ల కల్యాణం వేదపండితుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పట్టు వస్త్రాలు తీసుకవచ్చి కల్యాణంలో పాల్గొన్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ చల్లని దొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో బందో బస్తు నిర్వహించారు. క్షేత్రంకు వెళ్లే దారిలో ఘూట్ రోడ్డు వద్ద వన్‌వే కావడంతో వాహనాల రాకపోకలకు 2 గంటల ట్రాఫిక్ జామ్ అయింది.

**వేంపల్లెలో..**

వేంపల్లె : పాపాఘ్ని నది ఒడ్డున వెలిసిన శ్రీదుర్గా గవి మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు పోటెత్తారని ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు దుబ్బాక ప్రసాద్ శర్మల నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. పట్టణ పురవీధుల్లో తాళ మేలాలతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే చక్రాయపేట మండలంలోని శ్రీవెంకటేశ్వరస్వామి, వీరభద్ర స్వామి దేవస్థానంలో ప్రజల కోసం ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-15 ఆధ్వర్యంలో విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**కమలాపురంలో..**

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీ పాతాళ సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మధుసూధన శర్మ, సాయినిఖిల్ శర్మల నేతృత్వంలో స్వామి వారిని ప్రత్యేక కవచంతో అలంకరించారు. అనంతరం శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. గంగవరం, కోగటం, కంచన్నగారిపల్లె, కుంట, మీరాపురం, రామాపురం, టి.చదిపిరాళ్ల, దాదిరెడ్డిపల్లె, పెద్దచెప్పలి, దేవరాజుపల్లె తదితర గ్రామాలలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు. అలాగే టి.చదిపిరాళ్లలోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో శివ పార్వతుల కల్యాణం కనుల విందుగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పలు వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రంతా దేవస్థానంలో భజనలు చేశారు.

**సింహాద్రిపురంలో..**

సింహాద్రిపురం: భానుకోట శైవ క్షేత్రం, గురజాల ఆవధూత అప్పస్వామి దేవాలయాలతోపాటు వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో శివ నామస్మరణలతో మారుమ్రోగాయి. అర్చకులు బద్రిశర్మ, సురేష్ శర్మలు భానుకోట శ్రీసోమేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి భక్తుల జాగారణ కొరకు శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర నాటకం ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, రావులకొలను సర్పంచ్ కంభం మహేశ్వర్ రెడ్డిలు పర్యవేక్షించారు. అలాగే గురిజాలలో అవధూత అప్పస్వామి చిత్రపటానికి భజనలు చేస్తూ గ్రామోత్సవం వేకువ జాము వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

**ముద్దనూరులో..**

ముద్దనూరు : మండలంలోని ఆలయాల్లో శివుడికి అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక శ్రీ భవాని శంకరస్వామి ఆలయంలో, బొందలకుంట బసవేశ్వరస్వామి ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. యామవరం, కాన, మునయ్యకోన, మంగపట్నం ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

**లింగాలలో..**

లింగాల : మండలంలో పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి ఆలయం, అంబకపల్లె సిద్దేశ్వరస్వామి ఆలయం, లింగాల వనంబావి శివాలయం, బోనాల చినబావి శివాలయం, కర్ణపాపాయపల్లె స్వయంభు లింగేశ్వరస్వామి ఆలయం, ఇప్పట్ల, మురారిచింతల, ఎగువపల్లె, గుణకణపల్లె తదితర గ్రామాల్లో వెలసిన శివాలయాల్లో మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భజనలు, చెక్కభజనలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరింపజేశాయి.

**తొండూరులో**

తొండూరు : మండలంలోని బోడివారిపల్లె సమీపంలో ఉన్న గవిలింగేశ్వరస్వామి ఆలయం, మల్లేల సమీపంలోని దేవరకోన కత్తిమల్లేశ్వరస్వామి ఆలయం, ఊడవగండ్ల సమీపంలో ఉన్న కన్యకల చెలిమి శివాలయాలు భక్తులతో కిటకిటలాయి. అగడూరు, తొండూరు, ఇనగలూరు, సైదాపురం, మడూరు గ్రామాల్లోని శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వీరపునాయునిపల్లెలో..**

వీరపునాయునిపల్లె: మండలంలోని సంగమేశ్వరాలయం శివనామ స్మరణతో మారుమోగింది.భక్తులు సంగమేశ్వరుడు తదుపరి పార్వతీదేవిని దర్శించుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ నరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు. వీరపునాయునిపల్లె మునెయ్య బృందం నిర్వహించిన చెక్కభజన, దండుపల్లె గ్రామానికి చెందిన అంజి, మనోహర్ బృందం వారు నిర్వహించిన కోలాటం భక్తులను అలరించింది, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ ఎండి విశ్వేశ్వర్‌రెడ్డి బ్రదర్స్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మంజునాథ్ బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పలువురు సంగమేశ్వరుని దర్శించుకున్నారు. సంగమేశ్వరాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీనియర్ క్యాటగిరికి చెందిన ఎద్దులచే నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 13జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పోటీలను ప్రారంభించారు. రూ.లక్ష, రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10వేల నగదు బహుమతులను ఆలయ మాజీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి అందజేశారు. మిగిలిన వారికి రూ.8వేలు అందజేశారు.



పొలతలలో ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు

**వల్లూరులో..**

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని శివాలపల్లె వద్ద వెలసిన శ్రీ కాశీవిశ్వనాథ స్వామి, చెన్నూరులోని మల్లేశ్వరస్వామి , నాగనాగేశ్వర స్వామి, రామనపల్లెలోని మల్లికార్జునస్వామి, కైలాసగిరిలోని సిద్ధిలింగేశ్వరస్వామి, ఉప్పరపల్లెలోని నాగనాగేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైలాసగిరి శివాలయం వద్ద బండలగుడు పోటీలు నిర్వహించారు. ప్రొద్దుటూరు ఎద్దులు ప్రథమ బహుమతి గెలుపొందాయి. రూ.30000 వేలను కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి గుమ్మల సాయి చేతుల మీదుగా అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

**చింతకొమ్మదిన్నెలో..**

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని శివాలయాల్లో ప్రత్యే పూజలను నిర్వహించారు. బయనపల్లి ఉమామహేశ్వర ఆలయంలో కల్యాణం నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బుగ్గమల్లేశ్వరస్వామి క్షేత్రంలో కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించగా కే. విశ్వనాథరెడ్డికి చెందిన ఎద్దులు మొదటి బహుమతి రూ.40వేలు, కేజే చంద్రమోహన్‌రెడ్డికి చెందిన ఎద్దులు రెండవ బహుమతి రూ.30వేలు, లింగారెడ్డికి చెందిన ఎద్దులు మూడవ బహుమతి రూ.20వేలు గెలుపొందాయి.

**జమ్మలమడుగులో..**

జమ్మలమడుగు : కన్నెలూరులోని రామలింగేశ్వర శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం వేదపండితులు శివపార్వతుల వివాహాన్ని నిర్వహించారు. పలగాడీ వీధి సమీపంలో ఉన్న గ్రంథే సోమేశ్వర ఆలయంలో కల్యాణం నిర్వహించారు. పెన్నానది ఒడ్డున ఉన్న జంబులింగేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రముఖ శైవక్షేత్రమైన కన్యతీర్థంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం త్రిపుర సుందరి, సుందరేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు

**చక్రాయపేటలో..**

చక్రాయపేట : శ్రీవెంకటేశ్వర రాచరాయస్వామి ఆలయాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే శివపార్వతులు శ్రీలక్ష్మీవెంకటేశ్వర్ల కళ్యాణాన్ని ఒకే వేదికపై ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్రెడ్డి మురళీధర్‌రెడ్డి కుటుంబీకులు భారీగా అన్నదానం నిర్వహించారు. కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. వేడుకలను చైర్మన్ రామాంజనేయరెడ్డి పాలకమండలి సభ్యులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించారు. చక్రాయపేట ఎస్ఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

**వేములలో..**



శ్రీమిట్టమల్లేశ్వరస్వామిని దర్శించుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు



వేంపల్లె : గవిమల్లేశ్వరస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు ప్రసాద్ శర్మ



కమలాపురం శివాలయంలో తాళిబొట్లు చూపిస్తున్న ఆలయ అర్చకులు మధు సూదన శర్మ



చదిపిరాళ్లలో నిర్వహించిన స్వామి వార్ల కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు



సింహాద్రిపురం : ప్రత్యేక అలంకరణలో శ్రీభానుకోట సోమేశ్వరస్వామి

వేముల : మండలంలోని నల్లచెరువుపల్లె భైరవేశ్వర స్వామి ఆలయం, వేములలోని మంజునాథేశ్వర స్వామి ఆలయం, భూమయ్యగారిపల్లెలోని నాగలింగేశ్వరస్వామి ఆలయాలతోపాటు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. బెస్తవారిపల్లె ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



జమ్మలమడుగు : జంబులింగేశ్వర ఆలయంలో అర్ధనారీశ్వరుడు



చక్రాయపేటలో శివపార్వతులు, శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామిల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు



పొలతలలో కోనేటి నీరు అయిపోవడంతో బురద నీటిలో స్నానాలు చేస్తున్న భక్తులు



పొలతలలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

## రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## వైఎస్సార్ విగ్రహానికి వీరాభిమాని ఘన నివాళి

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వేంపల్లె మండలం చింతలమడుగుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ అభిమాని రామ్మోహన్ ఐదు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజారెడ్డి కంటి ఆసుపత్రి ప్రారంభించడంతో చాలామంది పేద ప్రజలకు కంటికి వైద్యపరీక్షలు అందుతాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవలేకపోవడంవల్ల ఆయన తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించానన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీరాభిమాని రామ్మోహన్

## శక్తి పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభం



ముద్దనూరులో ప్రారంభమైన పిరమిడ్ ధ్యాన కేంద్రం

ముద్దనూరు : స్థానిక డాక్టర్ పుల్లారెడ్డి ఆసు పత్రి ప్రాంగణంలో వెనుకవైపున మహాశివరాత్రి పర్వదినం బుధవారం అష్టాదశ శక్తి పిరమిడ్ ధ్యాన మందిరంను ప్రారంభించారు. సాయంత్రం పురవీధుల్లో భక్తులతో ర్యాలీ, కోలాటం నిర్వహించారు. ఈ పిరమిడ్ ధ్యాన మందిరంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లచే ధ్యానానుభవ ప్రవచనాలు, ధ్యాన సాధన కార్యక్రమాలు వుంటాయని ధ్యాన మందిర నిర్వాహకులు తెలిపారు. పలువురు స్థానిక ప్రముఖులు ఈ ధ్యాన మందిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముగిసిన గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు గంగమ్మతల్లి ఆలయ 32వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా ముగిసింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు గంగమ్మతల్లికి సమర్పించిన పట్టు వస్త్రాలకు ఆలయ నిర్వాహకులు వేలంపాట నిర్వహించగా రూ.20 వేలు ఆదాయం వచ్చింది. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కమలాపురం : పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వీరంరెడ్డి సత్యనారాయణరెడ్డి కుమారుడు, కోడలు ప్రణీత్‌రెడ్డి, ఇందురెడ్డిలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. జనవరి 31వ తేదీన వారి వివాహం జరిగింది. ఆ సమయంలో రాలేక పోయిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం పులివెందులలో నూతన వధూ వరులను ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## తెలుగు భాష తేజరిల్లాలి

వల్లూరు : సాహితీ యాత్రలో భాగంగా మహా కవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా బుధవారం వల్లూరులోని ప్రాచీన శివాలయంలో సాహితీ యాత్ర బ్యానర్‌ను అర్చకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఆయా ప్రాంతాల విద్యార్థులకు, ప్రజలకు అక్కడి చారిత్రక, పౌరాణిక, సాహిత్య నేపథ్యం తెలియజేస్తూ ఈ యాత్రలు సాగుతున్నాయని అన్నారు. సీపీ బ్రౌన్, గిడుగు వెంకట రామమూర్తి పంతులు, కవయిత్రి మొల్లమాంబ మొదలగువారికి తెలుగు ప్రజలు ఎంతో రుణపడి ఉన్నారన్నారు. మార్చి 13వ తేదీతో ముగియనున్న ఈ యాత్రలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి తేనెలొలుకు తెలుగు భాష రుచి చూపించి, బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నరసింహమూర్తి, ఎంఎల్ఎస్ శర్మ, శ్రీమతి సుచరిత, చంద్రశేఖర్, దీపక్ దీక్షిత్, నాగరాజ శర్మ, హర్ష, పవన్ సాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న హనుమంతరావు